సాక్షి
జోగులాంబ గద్వాల

బుధవారం : 3 : సెప్టెంబర్ : 2025



‘అమృత్’ పనుల్లో వేగం

పాలమూరు, గద్వాల రైల్వేస్టేషన్లలో సాగుతున్న అమృత్ భారత్ పనుల్లో వేగం పెంచాలని ద.మ. డీఆర్ఎం సంతోష్‌కుమార్ వర్మ కోరారు.

-8లో ▸



జూరాలకు తగ్గిన వరద

జూరాల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టడంతో మంగళవారం పది గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలారు.

-8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.7 /23.0

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మహిళల భద్రతకే షీ టీం

గద్వాల క్రైం: **మహిళల భద్రతకే షీ టీం బృందం పనిచేస్తుందని ఎస్పీ శ్రీనివాసరావు** మంగళవారం ఒక **ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, ముఖ్యమైన** కూడలిలో మ**హిళా చట్టాలపై ప్రజలకు అవగా**హన కల్పించి, వారిని చైతన్యం చేయాలని సిబ్బందికి సూచించారు. జూలైలో 12 ఈ–పెట్టి కేసులు నమోదు చేశామన్నారు. వేధింపులకు గురి చేసిన వ్యక్తులపై మూడు ఫిర్యాదులు రాగా.. వారిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. ఎవరైనా మహిళలపై, చిన్నారులపై వేధింపులకు గురి చేస్తే డయల్ 100 లేదా 87126 70312 కు సమాచారం అందించాలని కోరారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి



శాంతినగర్: క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరిస్తూ ఆటలు ఆడాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన బాలుర, బాలికల ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేలా పోటీలు కొనసాగించాలన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం వారితో సరదాగా కబడ్డీ ఆడుతూ క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. అనంతరం ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాతో సన్మానించారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు

వడ్డేపల్లి, శాంతినగర్‌లో వినాయక నవరాత్రుల్లో భాగంగా ప్రతిష్ఠించిన గణనాథులకు ఎమ్మెల్యే విజయుడు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖంగా ఉండాలని, శాంతియుతంగా నిమజ్జనం నిర్వహించాలని కోరారు.

నేడు సీఎం రేవంత్ పర్యటన

- వేముల ఎస్‌జీడీ ఫార్మా పరిశ్రమ రెండో యూనిట్‌ను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి



మహబూబ్‌నగర్ క్రైం/ అడ్డాకుల: మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం వేముల శివారులోని ఎస్‌జీడీ ఫార్మా కార్నింగ్ టెక్నాలజీస్ రెండో యూనిట్‌ను బుధవారం ఉదయం 11.30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి పరిశ్రమ వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు మంగళవారం కంపెనీ ముందున్న స్థలంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను కలెక్టర్ విజయేందిర, ఎస్పీ జానకి, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. అలాగే పరిశ్రమ లోపల జరిగే కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించి కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. సుమారు 1.45 గంటల పాటు సీఎం ఇక్కడ ఉండనున్నారు. మధ్యాహ్నం 12.45 గంటలకు హెలీకాప్టర్‌లో తిరిగి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాల కార్యక్రమానికి వెళ్లనున్నారు. సీఎంతోపాటు పలువురు మంత్రులు, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. కాగా.. కొత్తగా ఏర్పాటు చేసిన రెండో యూనిట్ ద్వారా మరో 200 మందికి ఉపాధి లభించే అవకాశం ఉంది.

956 మందితో భద్రతా ఏర్పాట్లు

ఎస్‌జీడీ ఫార్మాలో రెండో యూనిట్ ప్రారంభానికి సీఎం రేవంత్‌రెడ్డి రానుండటంతో ఎస్పీ డి.జానకి బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు. హెలిప్యాడ్, ట్రాఫిక్, వీఐపీ రాకపోకల మార్గాలను పరిశీలించి తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులతో చర్చించారు. అనంతరం బందోబస్తు విధులు నిర్వహించనున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. ఆయా విభాగాల నుంచి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రధానంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాతో పాటు నల్లగొండ, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి పోలీస్ బలగాలు విధులు నిర్వహించడానికి వేములకు చేరుకున్నారు. ఇద్దరు ఎస్పీలు, ఒక ఏఎస్పీ, ఐదుగురు డీఎస్పీలు, 27 మంది సీఐలు, 69 మంది ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు 173 మంది, కానిస్టేబుళ్లు 461 మంది, మహిళా సిబ్బంది 129, హోంగార్డులు 89 మందికి విధులు కేటాయించారు.

కబ్జా కోరల్లో దేవుడి స్థలం

దేవుడికి దానం ఇచ్చిన భూమి అన్యాక్రాంతం



ఎండోమెంట్ శాఖకు చెందిన షాపులు

- బావిని పూడ్చేసి దర్జాగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం
- చోద్యం చూస్తున్న అధికారులు
- వసూళ్లకు పాల్పడుతున్న ఎండోమెంట్ అధికారి

గద్వాల: పట్టణ నడిబొడ్డున సుమారు రూ.10కోట్ల విలువైన స్థలంపై కబ్జారాయుళ్ల కళ్లుపడ్డాయి. దేవుడికి దానం ఇచ్చిన స్థలాన్ని దర్జాగా కబ్జాపెట్టి అందులో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. దీనిపై వచ్చే అద్దెలతో కబ్జారాయుళ్లు జేబులు నింపుకొంటున్నారు. మరో వైపు ఎండోమెంట్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన షాపులకు ఒక్క రూపాయి కూడా అద్దె చెల్లించకుండా దర్జాగా తిష్టవేశారు. అక్రమార్కులతో దోస్తానా చేసిన ఎండోమెంట్ శాఖలో పనిచేసే ఓ అధికారి నెలనెలా తనకు రావాల్సిన మామూళ్లతో సరిపెట్టుకుంటుడడంతో రూ.కోట్ల విలువైన స్థలాన్ని పరిరక్షించేవారే కరువయ్యారు. కబ్జాకు గురైన ఎండోమెంట్ స్థలం వివరాలిలా....

కన్నేసి.. కబ్జా చేసి

పట్టణ నడిబొడ్డులో రూ.కోట్ల విలువైన స్థలం అన్యాక్రాంతం అవుతుంటే సంరక్షించాల్సిన ఎండోమెంట్ అధికారులు కళ్లప్పగించి చోద్యం చూస్తున్నారు. ఇటీవల కొందరు వ్యక్తులు బావిని పూడ్చేసి దాని పక్కనున్న స్థలంలో ఏకంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. ఇదంతా బాహాటంగానే జరుగుతున్నా అధికారులు మిన్నకుండిపోయారు.

పట్టణ నడిబొడ్డుగా పిలువబడే జానకమ్మ సత్రం ప్రాంతంలో ఉత్తనూరు వెంకట్‌రెడ్డి, పాపిరెడ్డి సర్వే నంబర్ 230లో 21గుంటలు, సర్వే 516లో 8గుంటలు, సర్వే నంబర్ 294లో 22 గుంటల స్థలం, బావితో పాటు దాని చుట్టూ మరికొంత ఖాళీ స్థలాన్ని దేవుడికి దానం చేశారు. దీని విలువ ప్రస్తుతం సుమారు రూ.10 కోట్లపైనే ఉంటుంది.

అవినీతికి కేరాఫ్‌గా..

గద్వాల ప్రాంతం దేవాలయాలకు సంబంధించి విలువైన భూములు ఉన్నాయి. వీటన్నింటిని గుర్తించి లెక్కతీసిన ఎండోమెంట్ అధికారి ఎక్కడెక్కడా కబ్జాకు గురయ్యాయో ఆ స్థలాలను గుర్తించి మొదట కబ్జారాయుళ్లకు నోటీసులు జారీ చేస్తారు. తరువాత వారితో టచ్‌లోకి వెళ్లి నెలవారి మాముళ్ల బేరం కుదుర్చుకుంటారనే ప్రచారం ఉంది. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే మీరు ఇచ్చే మామూళ్లు నాకు మాత్రమే కాదు.. ఉన్నతాధికారులకు సమర్పించుకోవాలి.. నన్ను ఎవరూ ఏమి చేయలేరు అంటూ దబాయిస్తున్నట్లు సమాచారం.

విచారణ జరిపి చర్యలు

గద్వాలలో జానకమ్మ సత్రానికి సంబంధించి కబ్జాకు గురైన స్థలంపై సమగ్ర విచారణ జరిస్తాం. స్వయంగా గద్వాలకు వచ్చి విచారణ జరిపిస్తాం. ఎక్కడైనా ఎండోమెంట్ శాఖ స్థలం కబ్జాకు గురైతే వాటిని తొలగిస్తాం. అదేవిధంగా 8 షాపులకు సంబంధించి అద్దె విషయంలో విచారణ జరిపి, అద్దెలు క్రమం తప్పకుండా వసూళ్లు అయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– మదనేశ్వర్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్, ఎండోమెంట్



కబ్జాకు గురైన స్థలంలో వెలిసిన షాపులు

షాపులకు అద్దె ఇవ్వడం లేదు

ఎండోమెంట్ ఆధ్వర్యంలో నిర్మించిన 8 షాపులకు ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం ఒక్కోషాపు రూ.30వేల వరకు అద్దె ఉంటుంది. అయితే ఇక్కడ మాత్రం ఒక్కో షాపును కేవలం రూ.1000 కే అద్దె కిచ్చారు. పోని అదయినా ప్రతినెలా క్రమం తప్పకుండా ఎండోమెంట్ శాఖకు చెల్లిస్తున్నారా అంటే అదీ లేదు. నెలల తరబడి ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా దర్జాగా వ్యాపారం చేసుకుంటూ లాభాలు గడిస్తున్నారు. అద్దె వసూళ్లు చేయాల్సిన అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. ఇక్కడ కూడ ఎండోమెంట్ శాఖ అధికారి చేతివాటం ప్రదర్శిస్తూ అద్దెకు బదులుగా సొంతంగా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వైఎస్సార్ సేవలు నేటికీ పదిలం



గద్వాలలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గద్వాలటౌన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశే**ఖరరెడ్డి ఉమ్మడి రాష్ట్ర ప్రజలకు అ**ందించిన సంక్షేమ **పథకాలు, సేవలు నేటికీ పదిలంగా** ఉన్నాయని కాం**గ్రెస్ నాయకులు కొనియాడారు.** వైఎస్సార్ వర్ధం**తిని పురస్కరించుకొని మంగళవారం** పట్టణంలోని **పాతబస్టాండ్ చౌరస్తాలో ఉన్న అ**యన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు, వివిధ కుల, ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీపీసీసీ నాయకుడు శంకర్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్లారెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల కోసం జీవిత బీమా, ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, విద్యార్థుల కోసం ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందించి విద్యా ప్రదాతగా నిలిచారని కొనియాడారు. ఎంతోమంది పేద పిల్లలకు గుండె ఆపరేషన్లు చేయించి వారి ఇళ్లలో నేటికి సజీవంగా ఉన్నారన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని సంక్షేమ కార్యక్రమాలు రాష్ట్రంలో చేపట్టిన ఘనత వైఎస్‌కే దక్కుతుందని తెలిపారు. వ్యవసాయం అంటే దండుగ అనే స్థాయి నుంచి పండుగ అనే విధంగా మార్చారన్నారు. కార్యక్రమంలో ఇసాక్, భాస్కర్‌యాదవ్, ఎల్లప్ప, పులిపాటి వెంకటేష్, కృష్ణమూర్తి, సురేష్, రామకృష్ణ, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు



డబుల్‌బెడ్రూం ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ఈ నెల 6న మంత్రి చేతుల మీదుగా పంపిణీ

గద్వాల: మండలంలోని పరమాల శివారులో రూ.85 కోట్లతో నిర్మించిన 1,275 డబుల్‌బెడ్రూం ఇళ్లలో ఇప్పటి వరకే 715 ఇళ్లను లబ్ధిదారులకే కేటాయించామని, వీటిని ఈ నెల 6న అందిస్తున్నట్లు కలెక్టర్ బీఎం సంతోష్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు కలెక్టర్ ఎమ్మెల్యేతో కలిసి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులతో సమీక్షించి, అనంతరం క్షేత్రస్థాయిలో డబుల్ బెడ్రూం ఇళ్లను సందర్శించారు. ఏమైన పెండింగ్ పనులు ఉంటే వాటని పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, హౌసింగ్ పీడీ శ్రీనివాస్‌రావు, ఆర్డీఓ అలివేలు, విద్యుత్ శాఖ ఎస్‌ఈ శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ ఎస్‌ఈ దామోదర్‌రెడ్డి, మిషన్‌భగీరథ ఈఈ శ్రీధర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు సరికాదు



గద్వాలలో ర్యాలీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

గద్వాలటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ పేరుతో బీఆర్‌ఎస్ అధినాయకత్వంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని బీఆర్‌ఎస్ నాయకుడు హనుమంతునాయుడు ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ జోలికొస్తే రాష్ట్రం అగ్నిగుండం అవుతుందని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణను నిరసిస్తూ మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, కృష్ణవేణి చౌరస్తాలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరంపై కాంగ్రెస్ ప్రభుత్వం విష ప్రచారం చేస్తుందని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో గోదావరి, కృష్ణా నదులపై ప్రాజెక్టులు కట్టకుండా తెలంగాణకు కాంగ్రెస్, టీడీపీలు తీరని ద్రోహం చేశాయని మండిపడ్డారు. ఘోష్ కమిషన్ ట్రాష్ అని, అసెంబ్లీలో చర్చించకుండా సీబీఐకి అప్పజెప్పడంతోనే కాంగ్రెస్ పార్టీ అభాసుపాలు అయిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణను సీబీఐకి ఇవ్వడం వెనక పెద్ద కుట్ర దాగి ఉందని అనుమానం వ్యక్తం చేశారు. తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్‌లు కలిసి పనిచేస్తున్నాయనడానికి ఇదే నిదర్శనమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు, బీఆర్‌ఎస్‌లపై కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. రాబోవు రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, చక్రధర్‌రావు, రాఘవేంద్రరెడ్డి, మోనేష్, బీచుపల్లి, రాజు, వెంకటేష్‌నాయుడు, రాము, శ్రీరాములు, చక్రధర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అతికూర్ రెహమాన్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రోడ్డెక్కిన అన్నదాతలు



అంబేద్కర్ చౌరస్తా వద్ద రోడ్డుపై బైఠాయించిన రైతులు

గద్వాల వ్యవసాయం: యూరియా కోసం రైతులు ప్రతి నిత్యం రాస్తారోకోలు, నిరసనలు చేపట్టాల్సిన దుస్థితి జిల్లాలో నెలకొంది. వారం రోజుల వ్యవధిలోనే గద్వాలలో రైతులు మరోసారి ఆందోళన చేపట్టారు. మంగళవారం ఉదయం 8 గంటల వరకే గద్వాల సింగిల్‌విండో కార్యాలయానికి దాదాపు 400 మంది రైతులు చేరుకున్నారు. యూరియా స్టాక్ లేదని, టోకెన్లు ఇప్పుడే ఇవ్వమని కార్యాలయ సిబ్బంది తెలిపారు. దీంతో ఆగ్రహించిన రైతులు కార్యాలయం ఎదుట పాదరక్షలు వరుస క్రమంలో ఉంచి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సమీపంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేపట్టారు. రోడ్డుపై రైతులు బైఠాయించడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న డీఎస్పీ మొగిలయ్య అక్కడికి చేరుకొని రైతులు, సింగిల్‌విండో కార్యాలయ సిబ్బందితో మాట్లాడారు. మంగళవారం రాత్రి వరకు స్టాక్ వస్తుందని సిబ్బంది డీఏస్పీకి చెప్పడంతో.. ఇప్పుడు టోకెన్లు తీసుకోవాలని, అందరికీ బుధవారం యూరియా ఇస్తారని శాంతింపజేశారు. దీంతో రైతులు రాస్తారోకో విరమించారు. 550 మంది రైతులకు 1,200 బస్తాల యూరియా టోకెన్లను సింగిల్‌విండో కార్యాలయ సిబ్బంది పంపిణీ చేశారు.



సింగిల్‌విండో కార్యాలయం ఎదుట చెప్పుల బారులు

క్షయ వ్యాధిగ్రస్తులకు సరుకులు పంపిణీ

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలోని క్షయ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి సిద్ధప్ప వ్యాధిగ్రస్తులకు సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాధిగ్రస్తులకు క్యూబ్ రూట్ ఫౌండేషన్ వారు న్యూట్రీషన్ కిట్లను అందజేయడం ఎంతో అభినందనీయమన్నారు. 19 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు 6 నెలలకు సరిపడా సరుకులు అందించారు. అనతరం ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులకు గురైన వారి వివరాలను ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు ఇందిర, రాజు, అభినేష్, సిబ్బంది సాదిక్ తదితరులు ఉన్నారు.

పల్లి క్వింటాకు గరిష్టంగా రూ.6,070

గద్వాల వ్యవసాయం: స్థానిక మార్కెట్ యార్డుకు మంగళవారం రైతులు 129 క్వింటాళ్ల వేరుశనగ తీసుకొచ్చారు. గరిష్టం రూ.6,070, కనిష్టం రూ. 2,750, సరాసరి రూ. 3,920 ధర పలికినట్లు అధికారులు తెలిపారు.

తుది ఓటరు జాబితా విడుదల

- 13 మండలాల్లో 3.93లక్షల ఓటర్లు

గద్వాల: జోగులాంబ గద్వాల జిల్లాలోని 13 మండలాల్లో తుది ఓటరు జాబితాను మంగళవారం అధికారులు విడుదల చేశారు. మొత్తం 13 మండలాల్లో 255 గ్రామ పంచాయతీలు, 2,390 వార్డులు ఉన్నాయి. ఇందులో మొత్తం 3,93,418 ఓటర్లు ఉన్నారు. కాగా పురుష ఓటర్ల సంఖ్య 1,93,627, మహిళా ఓటర్ల సంఖ్య 1,99,781, ఇతరులు 10మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు.

గజిబిజి తీగలు

- గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- ఇష్టారాజ్యంగా టీవీ, ఇంటర్నెట్ కేబుళ్లు
- ప్రమాదాలు జరిగినప్పుడే అధికారుల హడావిడి

గద్వాల టౌన్: జిల్లాలో అనేక చోట్ల విద్యుత్ స్తంభాలకు టీవీ, ఇంటర్నెట్ కేబుళ్లు ఇష్టానుసారంగా వేయడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. నిబంధనల ప్రకారం 18 అడుగుల ఎత్తుపై వీటిని లాగాలి. కానీ స్తంభాలకు ముడిపెట్టి తక్కువ ఎత్తులో లాగడంతో కిందకు వేలాడుతున్నాయి. ఇవి తెగి కరెంటు తీగలపై పడి ప్రమాదాలు జరిగే అవకాశమున్నా నిబంధనలు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం గద్వాలలో భారీ వినాయకుల విగ్రహాల నిమజ్జనోత్సవ ఊరేగింపు ఉంది. తర్వాత దుర్గాదేవి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. జిల్లా కేంద్రంతో పాటు అయిజ, శాంతినగర్ పట్టణాలు, మండల కేంద్రాల్లోని వీధుల్లో శోభాయాత్రలు చేపట్టడం పరిపాటి. అప్పుడు ఈ తీగలే ప్రమాదకరంగా మారి ప్రాణాలు బలి తీసుకునే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు వారాల కిందట హైదరాబాద్‌లో జరిగిన విద్యుత్ ప్రమాదంలో అరుగురు మృతి చెందిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న విద్యుత్ శాఖ నివారణ చర్యలు చేపట్టింది.



గద్వాలలో విద్యుత్ స్తంభానికి అస్తవ్యస్తంగా బిగించిన కేబుళ్లు

జిల్లాలో వీటి పరిస్థితిపై పరిశీలన కథనం...

పరిశీలనలో గుర్తించిన అంశాలు...

- ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలోని మున్సిపాలిటీ, పట్టణాల్లో ఇంటర్నెట్, టీవీ కేబుళ్లు తెగిపోయాయి. పాత వాటిని అలాగే ఉంచి కొత్త వాటిని వేయడంతో గజిబిజిగా మారుతున్నాయి.
- స్తంభాలకు కేబుల్, ఇంటర్నెట్ తీగల చుట్టలు వదిలేయడంతో విద్యుత్ సిబ్బంది స్తంభం ఎక్కాలంటే ఇబ్బంది పడుతున్నారు. కొన్నిసార్లు గాయాలపాలవుతున్నారు.
- స్తంభాల నుంచి ఇళ్లకు అమర్చిన తీగలపై కోతులు దూకినప్పుడు కిందకు వేలాడుతున్నాయి.
- విద్యుత్ స్తంభాలకు అనుమతులు లేకుండా కేబుల్ టీవీ, ఇంటర్నెట్ తీగలను ఇష్టారాజ్యంగా అమర్చడం వలన, విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయి.

కేబుళ్లను తొలగించాలి



విద్యుత్ స్తంభాలకు అమర్చిన కేబుల్ టీవీ, ఇంటర్నెట్ తీగలను తక్షణమే తొలగించాలి. పర్యవేక్షణ లేకపోవడం, కిందకు వేలాడే తీగలతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా తీగలు అమర్చిన ప్రైవేటు సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– శ్రీధర్, గద్వాల

తొలగింపు చర్యలు చేపడుతున్నాం

నిబంధనలకు విరుద్ధంగా కరెంటు స్తంభాలను ఉపయోగించి బిగించిన కేబుల్ తీగలను తొలగించే చర్యలు చేపట్టాం. జిల్లా కేంద్రంలో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. అయితే కేబుల్ టీవీ, ఇంటర్నెట్ సంస్థల నిర్వాహకులే స్వచ్ఛందంగా తీగలను నిబంధనల వేరకు అమర్చుకోవడానికి కొంత గడువు అడిగారు.

– రమేష్‌బాబు, ఏడీఈ, గద్వాల

నిత్యం ఫిర్యాదులు

జనవాసాల మధ్య, ఇళ్లపై నుంచి వెళ్తున్న ప్రమాదకర విద్యుత్ తీగలను తొలగించాలని చాలా కాలంగా ప్రజలు అధికారులను కోరుతున్నారు. వీటిపై నిత్యం విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రమాదాలు జరిగి, వైర్లు తెగిపడిన సందర్భాల్లో మాత్రమే హడావుడి చేస్తున్న ట్రాన్స్‌కో అధికారులు తర్వాత దాని గురించి పట్టించుకోవడం లేదు. అయితే జనావాసాలకు దగ్గరగా ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు కొన్నింటిని ఇటీవల అధికారులు గుర్తించి సరిచేశారు. మరికొన్ని ప్రాంతాల్లో ఉన్న తీగలను సరిచేయాల్సి ఉన్నా సిబ్బంది పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

క్లుప్తంగా

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



తెలంగాణ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు వెంటనే స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ నుంచి తెలంగాణ చౌరస్తా వరకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రశాంత్, భరత్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.8 వేల కోట్ల వరకు స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. చాలా మంది పేద విద్యార్థులు స్కాలర్‌షిప్‌పై ఆధార పడిచదువుతున్నారని, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చాలా మంది విద్యార్థులు విద్యకు దూరం అవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి స్కాలర్‌షిప్‌లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా గురుకులాలకు సొంత భవనాలు, కేజీబీవీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ఏఎన్‌ఎం పోస్టులను భర్తీ చేయాలని, జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అందించి, అధ్యాపక, ఎంటీఓ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీనాథ్, రమేష్, ఈశ్వర్, సాయి, మణికంఠ, హేమలత, జ్ఞాపిక తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

ధన్వాడ: మండలంలోని ఎమ్మెనోనిపల్లిలో ఓ ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. ఎమ్మెనోనిపల్లికి చెందిన కావలి నర్సింహులు మంగళవారం ఇంటికి తాళంవేసి.. కుటుంబ సభ్యులతో కలిసి ఊట్కూర్‌కు వెళ్లాడు. తిరిగి సాయంత్రం వచ్చి చూడగా.. తలుపులు ధ్వంసమై కనిపించాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా.. వస్తువులన్నీ చిందర వందరగా పడి ఉన్నాయి. ఇంట్లో ఉంచిన రూ. 10లక్షల నగదు, 2 తులాల బంగారం, 50 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. 10రోజుల క్రితం పొలం విక్రయించగా వచ్చిన సొమ్మును ఇంట్లో పెట్టినట్లు తెలిపారు. కాగా, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

ఫోన్ కొనివ్వలేదని.. కృష్ణానదిలో దూకాడు

- యువకుడి ఆత్మహత్యాయత్నం
- ప్రాణాలు కాపాడిన పోలీసులు



ఉషెనప్ప

కృష్ణా: మొబైల్ ఫోన్ కొనివ్వలేదని కృష్ణానదిలో దూకి యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన రాష్ట్ర సరిహద్దులో మంగళవారం చోటు చేసుకుంది. పూర్తి వివరాలు.. రాయచూర్ జిల్లా గుంజళ్లి గ్రామానికి చెందిన ఉషెనప్ప(22) కొంత కాలంగా ఫోన్ కొనివ్వడం లేదని తన తల్లితో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో కృష్ణానదిలో దూకి ఆత్మహత్య చేసుకోవడానికి మండల పరిధిలోని బ్రిడ్జి వద్దకు చేరుకొని నదిలోకి దూకాడు. స్పందించిన స్థానికులు శక్తినగర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు యువకుడిని రక్షించి రాయచూర్ రిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ విషయమై శక్తినగర్ ఎస్‌ఐ నారాయణను వివరణ కోరగా ఫోన్ ఇప్పించాలని ఇంట్లో తల్లితో గొడవపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. యువకుడికి ఇటీవల వివాహం జరిగినట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ బాంబు తుస్సుమంది



మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

- కాళేశ్వరం అవినీతిని వెలికితీయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం
- కవిత రాజకీయ జిమ్మిక్కులు చేస్తోంది: ఎంపీ డీకే అరుణ

పాలమూరు: అంతా.. ఇంతా అంటూ గొప్పలు చెప్పి ఇప్పుడు చేసేదేమి లేక సీబీఐ విచారణ అంటున్నారని, కాళేశ్వరం నిర్మాణంలో జరిగిన అవినీతిని వెలికితీయడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, ఆపార్టీ వ్యవహారం చూస్తుంటే అవినీతికి పాల్పడిన వాళ్లను కాపాడుతున్నట్లు ఉందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు ఆరోపించారు. కాంగ్రెస్ బాంబు పేల లేదని, కాంగ్రెస్ చెప్పే ఏ బాంబు అయినా ఇలాగే తుస్సు మంటుందన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తర్వాత మొత్తం సొమ్ము కక్కిస్తామని చెప్పిన మాటలు ఎక్కడపోయాయని విమర్శించారు. విచారణ కమిటీ రిపోర్ట్ నివేదికలు అంటూ తాత్సారం చేసి ఇప్పుడు అర్ధరాత్రి వరకు సభ ఏర్పాటు చేసి 20 నెలల తర్వాత సీబీఐ విచారణ అంటున్నారన్నారు. 'మీరు వేసిన కమిషన్ మీద మీకు నమ్మకం లేదా? మీ మీద మీకు నమ్మకం లేదా..' అంటూ హేళన చేశారు. ఆ కమిటీ నివేదిక ద్వారా ఏం తేల్చారని, ఎవరిని దోషులుగా చూపారో ఎందుకు బయటపెట్టాలేదని ప్రశ్నించారు. కమిటీ సూచనల ప్రకారం నిందితులపై ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. దొంగలు దొంగలు గట్టు పంచుకున్నట్లు, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు దొందు దొందుగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కాళేశ్వరం విషయంలో ఎమ్మెల్సీ కవిత డైలాగ్స్ చెబుతోందని, కాళేశ్వరంలో అవినీతి జరిగిందని స్వయంగా కవిత ఒప్పుకోవడం జరిగిందన్నారు. కానీ ఆ అవినీతిలో కేసీఆర్‌కు సంబంధం లేదంటూ చెప్పడం.. ఇదేక్కడి చోద్యం అన్నారు.ఈ రాష్ట్రాన్ని పదేళ్లు పాలించింది వాళ్ల కుటుంబమే కదా, కాళేశ్వరం అవినీతిలో కేసీఆర్ కుటుంబసభ్యులు అందరికీ సంబంధం ఉందన్నారు. కవిత రాజకీయ జిమ్మిక్కులు చేస్తోందని, పదేళ్లు వన్‌సైడ్ రాజకీయం చేసిన కేసీఆర్‌కు ఇందులో భాగస్వామ్యం లేదని చెప్పాడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

■ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం వల్లే యూరియా కొరత ఏర్పడి రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. సక్రమంగా మానిటరింగ్ చేయలేకపోవడంతో బ్లాక్ మార్కెట్‌కు వెళ్తుందన్నారు. వారి వైఫల్యం చెప్పుకోలేక కేంద్రం ఇవ్వలేదని బట్టకాల్చి వేస్తున్నారని ఎంపీ విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నేతలు పద్మజారెడ్డి, పడకుల బాలరాజు, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఎంపీ డీకే అరుణ హాజరై మాట్లాడారు. ఈనెల 17నుంచి అక్టోబర్ 2 వరకు ఎంపీ, ఎమ్మెల్యేలు నేతలు కార్యకర్తలు అందరూ వివిధ రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపొందే అవకాశాలు ఎక్కువగా ఉన్న క్రమంలో ప్రజలను కలుస్తూ కేంద్ర సంక్షేమ కార్యక్రమాలను వివరించాలన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో విజయం సాధిస్తే రాబోయో అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొంది రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని తెలిపారు.

అమృత్ భారత్ స్కీం పనుల్లో వేగం పెంచాలి



గద్వాల రైల్వే స్టేషన్ ఆవరణలో పనులు పరిశీలిస్తున్న డీఆర్‌ఎం సంతోష్‌కుమార్ వర్మ

డీఆర్‌ఎం సంతోష్‌కుమార్ వర్మ

గద్వాల న్యూటౌన్/స్టేషన్ మహబూబ్‌నగర్/అలంపూర్: మహబూబ్‌నగర్, గద్వాల రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్ స్కీం కింద చేపడుతున్న పనులను వేగంగా పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ మేనేజర్ సంతోష్‌కుమార్ సూచించారు. మంగళవారం ఆయన గద్వాల రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. ప్రత్యేక రైలులో వచ్చిన డీఆర్‌ఎం వస్తూనే రైల్వేట్రాక్‌ను చూసి, పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అధికారులతో కలిసి స్టేషన్, ప్లాట్‌ఫాం విస్తీర్ణం, ఆర్చి, వెహికిల్ పార్కింగ్, రోడ్ల పనులను పరిశీలించారు. ఆవరణలో మొక్కలు నాటారు. క్రూలాబీ (ట్రెన్ మేనేజర్ల రెస్ట్‌రూం) తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ భారత్ స్కీం కింద చేపడుతున్న పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన నూతనంగా నిర్మించిన రైల్వే ఆఫీసర్ల రెస్ట్ హౌస్‌ను ప్రారంభించారు. డీఆర్‌ఎం వెంట రైల్వే డివిజనల్ ఇంజినీర్ అరుణ్‌కుమార్ శర్మ, డివిజనల్ ఎలక్ట్రిక్ ఇంజినీర్ కిరణ్‌కుమార్, డివిజనల్ సిగ్నల్ టెలికాం ఇంజినీర్ సృజన్‌కుమార్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ సురేష్‌కుమార్ ఉన్నారు.

జోగుళాంబ రైల్వే హాల్ట్ పరిశీలన

జోగుళాంబ రైల్వే హాల్ట్ పనులను సౌత్ సెంట్రల్ రైల్వే డీఆర్‌ఎం సంతోష్‌కుమార్ శర్మ పరిశీలించారు. రైల్వే స్టేషన్‌లో విశ్రాంతి, స్టేషన్ గదులను, హై లెవల్ ప్లాట్‌ఫాం, షెడ్డు పనులను పరిశీలించారు. అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జోగుళాంబ అమ్మవారి దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఖాళీలు భర్తీ చేయాలని వినతి

గద్వాల ఇంజినీరింగ్ పీవే సెక్షన్ బైబర్‌కేషన్ వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ అసిస్టెంట్ డివిజనల్ సెక్రెటరీ రైల్వేశంకర్ డీఆర్‌ఎంకు వినతిపత్రం అందించారు. సిగ్నల్ అండ్ టెలికాం డిపార్ట్‌మెంట్లలో టెక్నీషియన్, హెల్పర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. స్టేషన్ మాస్టర్లను నియమించాలని, ప్రస్తుతం ఉన్న ఎలక్ట్రికల్ భవనం స్థానంలో నూతన భవనాన్ని నిర్మించాలని వినతిపత్రంలో కోరారు.

మానసిక దివ్యాంగులను మనసుతో చూడాలి



మానసిక దివ్యాంగుడితో మాట్లాడుతున్న జడ్జి ఇందిర

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర

మహబూబ్‌నగర్ రూరల్: మానసిక దివ్యాంగులను మనసుతో చూడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర అన్నారు. జిల్లా కేంద్రం టీచర్స్ కాలనీలోని బ్రహ్మ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలను జడ్జి సందర్శించి న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో వసతి సౌకర్యాలు ఎలా ఉన్నాయో పరిశీలించారు. అన్ని సదుపాయాలు అందుతున్నాయా లేవా అని పాఠశాల నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వారి ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. దివ్యాంగుల తల్లిదండ్రులకు వైకల్యం ఉన్న పిల్లలను ఉత్సాహం, ధైర్యం కలిగించడం కోసం లీగల్ సర్వీసెస్ యూనిట్ ఫర్ మనోన్యాయ, దివ్యాంగన్ కౌశల్ వికాస్, దివ్యాంగన్ రోజ్‌గార్ సేతు వంటి స్కీం అందుబాటులో ఉన్నాయన్నారు. బ్రహ్మ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల మానసిక దివ్యాంగులకు ఒక ఆలయం లాంటిదన్నారు. ఇక్కడి పిల్లలు విద్యాబుద్ధులతో పాటు ఒకేషనల్, కంప్యూటర్ శిక్షణ మొదలగునవి పొందుతున్నారని, రోజువారి దినచర్యలో చేపట్టే కార్యక్రమాలు, ఫిజియోథెరపి, స్పీచ్‌థెరపి, బిహేవర్ మోడిఫికేషన్ చేస్తున్నారని తెలిపారు. వీటిద్వారా మానసిక దివ్యాంగులు సెరిబ్రల్ పాలసీ చిల్డ్రన్స్ ఫిజియోథెరపి ద్వారా ప్రయోజనం పొందుతున్నారని చెప్పారు. ఈ విధమైన శిక్షణ ఇవ్వడం ద్వారా పిల్లల్లో మనోధైర్యంతోపాటు తెలివితేటలు కూడా మెరుగుపడుతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు గన్నోజు చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ



టోర్నమెంట్ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఈనెల 4 నుంచి 7వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ (అండర్-13)బ్యాడ్మింటన్ టోర్నమెంట్ బ్రోచర్లను జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ 4వ తేదీన క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లు, 5 నుంచి మెయిన్‌డ్రా పోటీలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసుందర్‌గౌడ్, ఎల్.రవికుమార్, సంయుక్త కార్యదర్శులు నాగరాజుగౌడ్, ఉదయ్, భాను ప్రకాశ్, సభ్యులు సతీష్ పాల్గొన్నారు.

పీయూలో హెచ్‌ఓడీల నియామకం



ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ మాలవికి నియామక పత్రం అందజేస్తున్న వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో పలు డిపార్ట్‌మెంట్లకు సంబంధించి హెచ్‌ఓడీలను నియమిస్తూ మంగళవారం వీసీ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. కెమిస్ట్రీ హెచ్‌ఓడీగా విజయలక్ష్మి, ఫిజిక్స్ హెచ్‌ఓడీగా అంకం భాస్కర్, పొలిటికల్ సైన్స్ హెచ్‌ఓడీగా కుమారస్వామి, ఇంగ్లిష్ హెచ్‌ఓడీగా మాలవి, మైక్రో బయోలజీ హెచ్‌ఓడీగా మధుసూదన్‌రెడ్డిని ఫాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ డీన్‌గా ఓయూ అధ్యాపకుడు ఎం.రాములును, ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ డీన్‌గా కృష్ణచైతన్య, ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్‌గా రామకృష్ణను నియమించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ఆడిట్‌సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉధృతి తగ్గని డిండి ప్రాజెక్టు



అలుగు పారుతున్న డిండి ప్రాజెక్టు

- దుందుభిలో కొనసాగుతున్న వరద

ఉప్పునుంతల: ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదతో దుందుభీ వాగులో వరద ప్రవాహం కొనసాగుతోంది. మండల సరిహద్దులోని డిండి ప్రాజెక్టు అలుగు ఉధృతి తగ్గడం లేదు. అలుగుతో పాటు ప్రాజెక్టు ఎడమ, కుడి కాల్వ ద్వారా నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. చెరువు కట్ట కింద ప్రాజెక్టు అలుగు వద్ద చేపల వ్యాపారం జోరుగా సాగుతుంది.




తిర్మలాపూర్- చింతపల్లి బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభీ వాగు

జూరాలకు తగ్గిన వరద



జూరాల నుంచి దిగువకు పారుతున్న వరద



మూసేసిన శ్రీశైలం గేట్లు

10 క్రస్ట్ గేట్లు పైకెత్తి దిగువకు నీటి విడుదల

ధరూరు/ఆత్మకూర్/మదనాపురం: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద క్రమంగా తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం 1,56,615 క్యూసెక్కులు ఉండగా... మంగళవారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో 1.26 లక్షలకు తగ్గినట్లు చెప్పారు. దీంతో ప్రాజెక్టు 10 క్రస్ట్‌గేట్లను పైకెత్తి 69,630 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. విద్యుదుద్పత్తి నిమిత్తం 36,674 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750, ఆవిరి రూపంలో 67, ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 500, భీమా లిఫ్ట్‌కు 750 క్యూసెక్కులు వినియోగించినట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.048 టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి..

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో మంగళవారం ఉత్పత్తి కొనసాగినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 6 యూనిట్ల నుంచి 234 మెగావాట్లు, 272.587 మి.యూ, దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 299.688 మి.యూ. విద్యుదుత్పత్తి జరిగిందన్నారు. రెండు కేంద్రాల్లో ఇప్పటి వరకు 572.275 మి.యూ. ఉత్పత్తి చేపట్టినట్లు వివరించారు.

రామన్‌పాడులో 1,020 అడుగులు..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో మంగళవారం సముద్రమట్టానికి పైన 1,020 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు అధికారులు తెలిపారు. జూరాల ఎడమ కాల్వ ద్వారా 798 క్యూసెక్కుల వరద కొనసాగుతుండగా.. సమాంతర కాల్వలో సరఫరా లేదన్నారు. జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వకు 875 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 55 క్యూసెక్కులు, వివిధ ఎత్తిపోతల పథకాలకు 763 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగించినట్లు చెప్పారు.

శ్రీశైలం గేట్లు మూసివేత

దోమలపెంట: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో మంగళవారం సాయంత్రం గేట్లన్నీ మూసివేశారు. సాయంత్రం వరకు మూడు గేట్లు తెరిచి దిగువన నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేశారు. జూరాల ఆనకట్ట స్పిల్‌వే నుంచి 69,630, విద్యుదుత్పత్తి చేస్తూ 36,674, సుంకేసుల నుంచి 71,519 క్యూసెక్కుల ప్రవాహం శ్రీశైలం జలాశయానికి చేరింది. ప్రస్తుతం జలాశయంలో 881.8 అడుగుల నీటిమట్టం, 197.9120 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడుకు 28,500, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,817, ఎంజీకేఎల్‌ఐకు 417 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.758 మి.యూ., కుడిగట్టు కేంద్రంలో 15.152 మి.యూ. విద్యుదుత్పత్తి చేశారు.

సుంకేసుల 17 గేట్లు తెరిచి..

రాజోళి: సుంకేసుల జలాశయానికి వరద మంగళవారం భారీగా పెరిగింది. దీంతో 17 గేట్లను ఒక మీటర్ మేర తెరిచి దిగువకు నీటిని విడుదల చేసినట్లు జేఈ మహేంద్ర తెలిపారు. ఎగువ నుంచి 75 వేల క్యూసెక్కులు రాగా.. 71,519 క్యూసెక్కులు దిగువకు, 2,095 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు వదిలామన్నారు.

పోక్సో కేసు నమోదు

చిన్నంబావి: బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన ఘటనలో యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపిన వివరాలు.. మండలంలోని పెద్దదగడ గ్రామానికి చెందిన సురేష్ అదే గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలికపై గత నెల 27న అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రులు మంగళవారం ఫిర్యాదు చేయగా యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

భాషా పండితుల పాత్ర కీలకం: ఎమ్మెల్యే



ఉపాధ్యాయులకు జ్ఞాపికలను అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో భాషాపండిత్‌ల పాత్ర కీలకమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక బీకేరెడ్డి కాలనీలోని మహబూబ్‌నగర్ ఫస్ట్-నవరత్నాలు శిక్షణ కేంద్రంలో రెండోరోజు మంగళవారం ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాథ్స్, సైన్స్, బయాలజీ, సోషల్ స్టడీస్ సబ్జెక్టులలో పట్టు సాధించేందుకు ల్యాంగ్వేజెస్ ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. వీటి ద్వారా ఇతర సబ్జెక్టులను సులభంగా అర్థం చేసుకోవచ్చన్నారు. 'శత శాతం'తో పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్స్ తగ్గాయని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు పుస్తక పఠనం అలవాటు చేయాలని, ముఖ్యంగా స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రిజిస్టర్ (ఎస్‌ఐఆర్) నిర్వహించాలన్నారు. అనంతరం ఇక్కడి ఆవరణలో ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డీఈఓ ప్రవీణ్‌కుమార్, సీఎంఓ బాలుయాదవ్, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్, మహబూబ్‌నగర్ ఫస్ట్ కేంద్రం ఇన్‌చార్జ్ నిజలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ లేఖలపై చెల్లింపులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల హయ్యర్ పెన్షన్ అమలు కోసం అందిన డిమాండ్ లేఖలననుసరించి డీడీల రూపంలో డబ్బులు చెల్లించిన వారికి ఈ నెలలో హయ్యర్ పెన్షన్ అమలు జరపనున్నట్లు ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫోరం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు రాజసింహుడు, జీబీ పాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సోమవారం తమ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావు హైదరాబాద్‌లోని బర్కత్‌పుర పీఎఫ్ కార్యాలయంలో కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్‌లను కలిసి డిమాండ్ లేఖలపై డబ్బులు చెల్లించిన, ఏరియర్స్ రానివారి విశ్రాంత ఉద్యోగుల జాబితాను అందజేసినట్లు వివరించారు.

రేపు మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డి విగ్రహావిష్కరణ

- హాజరుకానున్న డిప్యూటీ సీఎం భట్టి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్



మాట్లాడుతున్న టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పటిష్టత, ఈ ప్రాంత అభివృద్ధి కోసం దివంగత మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డి చేసిన సేవలు మరువలేనివని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థిదశ నుంచి రాష్ట్ర, జిల్లా రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. టీడీపీ హయాంలో ఈ ప్రాంతంలో సాగు, తాగునీటి కోసం ఎన్నో ఉద్యమాలు చేశారని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం పార్టీకి చెందిన ఇతర నాయకులతో కలిసి కొల్లాపూర్ నుంచి నారాయణపేట, అలంపూర్ నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్రలు చేసినట్లు తెలిపారు. ఈనెల 4న గురువారం జిల్లా కేంద్రం పద్మావతీకాలనీలోని గ్రీన్‌బెల్టులో మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, నాయకులు సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, చంద్రకుమార్‌గౌడ్, సీజే బెనహర్, సిరాజ్‌ఖాద్రీ, రాజేందర్‌రెడ్డి, గోపాల్ యాదవ్, జహీర్ అఖ్తర్, లింగం నాయక్, అజ్మత్ అలీ తదితరులు పాల్గొన్నారు.